# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం, 24 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## నేటినుంచి వేసవి సెలవులు




మిగతా 3లో..

## తమిళనాడులో పోలింగ్ ప్రారంభం




- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు
- ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి

**చెన్నై,ఏప్రిల్23:**తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యిం ది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు పృఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియో గించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును మిగతా 3లో..

## రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు



- ఈకెవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం

మిగతా 5లో.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

**కోల్‌కతా,ఏప్రిల్23 :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీ నిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగు రవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంత మందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాల నను




వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూ నిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద మిగతా 3లో..

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ



- రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ
- పార్టీ సంస్థాగత నిర్మాణపైనా చర్చ
- నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన

5లో..

## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు




- ఆర్టీసీ సమ్మెపై కేబినేట్ భేటీలో ప్రస్తావన
- నేడు చర్చలు జరపాలని డిప్యూటి సిఎంకు ఆదేశం
- అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి

**హైదరాబాద్,ఏప్రిల్23 :**ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణ యాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం మిగతా 3లో..

## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

- చొరబాట్లను పూర్తిగా నిరోధిస్తాం
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**కోల్‌కతా,ఏప్రిల్23 :**పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే చొరబాట్లను పూర్తిగా



కట్టడి చేస్తామని అన్నారు. ఇంతకాలం మమతా బెనర్జీ చొనబాట్లను ప్రోత్సహిస్తూ దేశ బవిష్తయ్‌కు సవాల్ విసిరారని మండిపడ్డారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటు దారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో) కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ మిగతా 3లో..

## ఆర్టీసి సమ్మెలో ఉద్రిక్తత

- పెట్రోల్ పోసుకుని డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**వరంగల్,ఏప్రిల్23:**ఆర్టీసీ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం తీవ్ర సంచలనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో దిగిన ఆర్టీసీ కార్మికులు రెండోరోజు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు పిలుపు నిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం నర్సంపేట డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న డ్రైవర్ కోలా రమేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సహచర కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసి తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

## ఆర్టీసీ కార్మికులు తీవ్ర చర్యలకు పాల్పడొద్దు

- నేడు మంత్రుల బృందంద చర్చలకు సిద్ధం
- అనవసరంగా కుటుంబాలను రోడ్డుపాల్చేయవద్దు
- కార్మికులకు మంత్రుల వినతి

**హైదరాబాద్,ఏప్రిల్23 :** ఆర్టీసీ కార్మికులు ఎవరూ తీవ్ర చర్యలకు పాల్పడవద్దని.. ఆవేశంలో ఉద్రేకానికి లోనయ్యి ఆత్మహత్యా ప్రయత్నాలు చేసుకోవద్దని మంత్రుల బృందం పిలుపునిచ్చింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కేబినెట్ భేటీలో చర్చించామని.. సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేబినేట్ భేటీ అనతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, దామోదరలు మీడియాతో మాట్లాడారు. నేడు ఆర్టీసీ కార్మికులతో డిప్యూటి సిఎం భట్టి బృదంచర్చలు జరుపుతుందన్నారు. ఉద్రేకంలో.. భయంతో.. ఆవేశంలో కార్మికులు తీవ్ర చర్యలకు పాల్పడితే.. కుటుంబాలకు అన్యాయం చేసినోళ్లు అవుతారని.. ఎవరూ ఆత్మహత్యా ప్రయత్నాలకు దిగవద్దని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ సమ్మె చాలా చాలా మిగతా 3లో..

## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**గజ్వేల్,ఏప్రిల్23 :** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్ మెంట్(వోఎఫ్ సీఈ), ఇండ స్ట్రియల్/ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ /డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది.తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయార వుతాయి.కొత్తగా 230హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.

## కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్



### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్23 :** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ మిగతా 3లో..

## తెలంగాణ భవిష్యత్ కెసిఆర్‌కే సాధ్యం

- సమావేశంలో జీవన్ రెడ్డి

**రాజన్నసిరిసిల్ల,ఏప్రిల్23 :** కుట్రలు, కుతంత్రాలతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడటమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జగిత్యాల సభ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొ న్నారు. రేవంత్ రెడ్డి పోవాలే కేసీఆర్ రావా లేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యావత్ తెలంగాణ ప్రజలకు జీవధార అని వెల్లడించారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు అని వివరించారు. కేసీఆర్, హరీష్‌రావు, అధికారులను కేసులో ఇరికించాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు.

## కాళేశ్వరం పేరుతో తెలంగాణ సొమ్ము నాశనం

- హైకోర్టు తీర్పుపై ఎందుకు సంబరాలు చేస్తున్నారు
- త్వరలోనే సంరాల రాంబాబులను లోపలేయడం ఖాయం
- మీడియా సమావేశంలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్23 :** హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ):కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శిం చారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబ ద్దాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్దాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు. '24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయిందన్నారు. సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. మిగతా 3లో..

## రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

### ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

### భారీగా పోలింగ్ శాతం నమోదు

**న్యూఢిల్లీ,ఏప్రిల్23 :** దేశంలో కీలక రాష్ట్రాలైన తమిళ నాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ తొలి విడత ఎన్నికల్లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పుర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ప్రజలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును



వినియోగించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం, తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. మొత్తం 294 స్థానాలు ఉండగా తొలి విడతలో 152 సీట్లకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోని ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4 సోమవారం వెల్లడిస్తారు.

# ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు**
**వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి**
**11మంది సజీవ దహనం**




**లక్నో,ఏప్రిల్23 :** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందు వెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

# పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి



**కోల్‌కతా,ఏప్రిల్23 :** తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతం లోగల ఒక పోలింగ్ బూత్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాల పాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

# కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని చేశారు

**కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పుతో దెబ్బ**
**మాజీ ఎమ్మెల్యే బీగాల గణేశ్ వెల్లడి**



**నిజామాబాద్,ఏప్రిల్23 :**
కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసు కోవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించడం ద్వారా న్యాయం గెలిచిందని మాజీ ఎమ్మెల్యే గణెష్ బిగాల అన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన ప్రాముఖ్యత లేదని తేలిందన్నారు. ముఖ్యంగాసెక్షన్ 8కిందసంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలకమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయంగా ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని మండిపడ్డారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, చివరకు గత్యంతరం లేక ఇప్పుడు పనులు చేపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ దండు నీతుకిరణ్ శేఖర్, పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ ఔజఅం చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, గాండ్ల లింగం, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది



**హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే**
**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాటాడుతూ.. కేసీఆర్ కుటుం బంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేక పోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

**పెంచుతామన్న వేతనాలు అమలు చేయాలి**
**విజయనగరంలో అంగన్‌వాడీల భారీ ర్యాలీ**



**విజయనగరం,ఏప్రిల్23:** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స యూనియన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులు మే నెల మొత్తం ఇవ్వాలని, ప్రభుత్వం పెంచుతామన్నా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, మీదుగా గంట స్థంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ప్రభావతి, సి ఐ టి యు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యుఎస్ రవికుమార్ లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వేసవి సెలవులు నెలరోజులు ఇస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 21 నెలలు కావస్తున్న అంగన్వాడి లు గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో వైపు జీఓ5 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ లను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో రాష్ట్ర కేంద్రంలో అంగన్వాడీలు ధర్నా చేస్తే పదిరోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన పెద్దలు నెలరోజులు దాటిన ఇంతవరకు మా సమస్యలపై సమాధానం చెప్పలేదన్నారు. తక్షణమే అంగన్వాడీలు కు కనీస వేతనాలు ప్రకటించి, వేసవి సెలవులు నెలరోజులు ప్రకటించాలని పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సుశీల, రాధ, సిఐటియు నాయకులు బి.రమణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ నుండి హయత్‌నగర్ వరకు కారిడార్

- **డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు చెక్**
- **ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్23 :** ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని, హైదరా బాద్ – విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు.ఎన్‌హెచ్ 65రూట్ లో ఎల్బీ నగర్ నుండి హయత్‌నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి, రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగు తున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్త యితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహ దారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు.

# ఇంధన భద్రతపై భారత్ దృష్టి

**గ్రీన్ ఉనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్23 :** ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగాపావులుకదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్‌హైడ్రోజన్‌అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలిసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజ కీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడు తున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందు కోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పా టుతో 2030కల్లా ఏటా 50 లక్షల మెట్రిక్‌టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయా లని లక్ష్యంగా పెట్టు కుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదా పుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్య య పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకుదూరంగా పశ్చిమ దేశాలువెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి.ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారు చేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్‌పెరిగేలా మార్కె ట్‌ను ఉనికిలోకి తీసుకురా వడంపై దృష్టి పెట్టాయి. రిఫైనరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సం స్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపె డు తూ ప్రైవేటు పెట్టుబడులను భార త్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖని జవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చి మాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బ oదుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగం లోని దిగ్గజాలను లేదాప్రైవేటుసంస్థలను రంగంలోకిదింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రా జెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించు కోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

# నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

**తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం**
**ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి**




**హైదరాబాద్,ఏప్రిల్23 :** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

# ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

**తాండూరులో టెంట్ సామాను ఇవ్వకుండా పోలీసుల ఒత్తిడి**
**రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ తలసాని**

**హైదరాబాద్,ఏప్రిల్23 :** ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని, తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేస్తామని ఎల్‌అండ్‌టీ ముందుకు వస్తే బెదిరించారని తెలిపారు . మేడిగడ్డ కుంగినప్పుడు ఆగమేఘాల మీద వచ్చిన ఎన్డీఎస్‌ఏ , ఎస్ఎల్‌బీసీ కుంగి 8 మంది చనిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

# ఓటు వేయడం బాధ్యతగా గుర్తించండి

**తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్23 :** తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించు కోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషి స్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని కల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గత రికార్డులను తిరగరాస్తూ, ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరగా లని ప్రధాని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పండుగలో పౌరుల ందరూ చురుగ్గా పాల్గొని.. పారదర్శకమైన, పటిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో తమ వంతు సహకారం అందించాలని 'ఎక్స్' వేదికగా ఆయన సందేశాన్ని పంచుకున్నారు.

# ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్,ఏప్రిల్ 23 :**
కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభు త్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిప డ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరుపున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. రేపు(శుక్రవారం) ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేలు జరిమాన

**హంగర్గ గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు**

**నిజామాబాద్,ఏప్రిల్23 :** తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా పోతంగల్ హంగర్గ గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగు,రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని అన్నారు. దీంతో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్ అమ్మవద్దని, జంక్‌ఫుడ్స్ నిషిద్ధమని తెలిపారు .అనంతరం శివాజీ చౌక్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి, గ్రామ కార్యదర్శి గంగారాం, భజరంగ్, గోవింద్, ఉమ్మార్,జీవన్ పాల్గొన్నారు.

# నగరంలో పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

**దాడి చేసి ముఠాను పట్టుకున్న పోలీసులు**



**హైదరాబాద్,ఏప్రిల్23** హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణం గా పెట్టి కాసులు కురిపిం చుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్మతతున్న ముఠాను పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడి లాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలి పారు. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసు లు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ కల్తీ టీ పొడిలో కలిపే రంగులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యా ధు లకు దారితీస్తాయని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## డీజీపీ హోదాలో హైదరాబాద్ సీపీగా బాధ్యతలు తీసుకున్న సజ్జనర్

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ కేడర్‌కు చెందిన ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు డీజీపీలుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. 1996 బ్యాచ్‌కు చెందిన వీ.సీ.సజ్జనర్‌కు డీజీపీగా హోదా లభించింది. అదనపు డీజీపీ హోదాలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న సజ్జనర్ డీజీపీలో హోదాలో సైతం హైదరాబాద్ సీపీగా గురువారం ఛార్జ్‌తీసుకున్నారు.



## బ్యాంకుల్లో 'మ్యూల్ ఖాతాలు' ఉంటే కఠిన చర్యలు

- మ్యూల్ ఖాతాల నియంత్రణపై బ్యాంకు అధికారులతో సమన్వయ సమావేశం
- నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరిక

బలగం టీవీ, హైదరాబాద్

బ్యాంకు అధికారులు కేవలం ఖాతాల ఓపెనింగ్ టార్గెట్స్ వెంట పడకుండా, కస్టమర్ల భద్రతకు పెద్దపీట వేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. ఒక్క కస్టమర్ కూడా సైబర్ నేరాల బారిన పడకుండా చూడటమే ప్రాథమిక లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో గురువారం మ్యూల్ ఖాతాల నియంత్రణపై బ్యాంకు అధికారులతో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్, అడిషనల్ సీపీ ఎం. శ్రీనివాసులుతో పాటు 45 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 75 మంది ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలను అరికట్టేందుకు 'సేఫ్ కస్టమర్ చాలెంజ్'ను బ్యాంకులు స్వీకరించాలని కోరారు. ప్రతి బ్యాంకు శాఖ 'జీరో మ్యూల్ అకౌంట్స్' లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బ్యాంకు మేనేజ్‌మెంట్లు ఖాతాల సంఖ్యను కాకుండా, కస్టమర్ల భద్రతనే ఉద్యోగుల కీలక పనితీరు సూచికగా పరిగణించాలని హితవు పలికారు. ఆపరేషన్ ఆక్టోపస్ 2.0లో భాగంగా 850 కేసుల్లో రూ. 150 కోట్ల మోసాన్ని గుర్తించామని, మ్యూల్ ఖాతాల ఓపెనింగ్‌లో సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులను అరెస్ట్ చేశామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్స్ డీసీపీ అరవింద్ బాబు, ఏసీపీ శివమారుతితో పాటు 45 బ్యాంకులకు చెందిన 75 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

- వచ్చే వారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీనీ కలుస్తాం
- ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ ఆల్ ఇండియా రేడియోస్టేషన్ వరకు 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ లక్షలాది మంది వాహనదారులకు ఉపశమనం కలుగుతోందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాయలంలో ఎలివేటెడ్ కారిడార్‌పై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ఈ ప్రాంతాన్ని డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌తో ప్రమాదరహితం మార్చబోతున్నట్టు తెలిపారు. అందుకు రూ. 941 కోట్ల ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్ర వాటాగా రూ. 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. జాతీయరహదారి 65 రూట్‌లో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విపరీతమైన రద్దీతో రోడ్ దాటేందుకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారనీ, ఈ సమయంలో రోడ్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనికి వీలైనంత త్వరగా అనుమతులు పొంది, టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు ఎంవోఆర్‌టీహెచ్ వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని ఆర్‌వో కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి, పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్, స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించినట్టు తెలిపారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా, వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా సూచించారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీపీఆర్ అంచనా సిద్ధం చేయాల ని కోరారు. దీనిపై వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంవోఆర్‌టీహెచ్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్, ఆర్ అండ్ బీ సీఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ ఆత్మహత్య దురదృష్టం

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్




నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య దురదృష్టకరమని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం విధానాల ఫలితంగా అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని 2023లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విలీన ప్రక్రియ పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. మొత్తం 32 డిమాండ్లపై ఈ నెల 13న సమ్మె నోటీసు ఇచ్చినా.. రెండు సార్లు చర్చలు జరిగినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం స్పందించలేదని పేర్కొన్నారు. దీంతో విధి లేని పరిస్థితుల్లోనే కార్మికులు సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. సీఎం, మంత్రులకు కార్మిక సంఘాలు సమస్యలను వివరించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం తాత్కాలికంగా నైపుణ్యం లేని డ్రైవర్లను నియమించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. బుధవారం ఒక తాత్కాలిక డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా 38 మంది ప్రయాణికులు గాయపడ్డారని తెలిపారు. ఆర్టీసీ సమ్మెకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని, అందరినీ జైలుకు పంపుతారా అని ప్రశ్నించారు. బీజేపీ ఈ విషయంలో స్పష్టమైన వైఖరి చూపకుండా గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

# ఆర్టీసీ సమ్మెలో ఆందోళనకర పరిస్థితులు

- నల్లగొండ, వరంగల్‌లో

**ఇద్దరు డ్రైవర్ల ఆత్మహత్య యత్నం**

బలగం టీవీ, నల్గొండ

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్రంలో పలుచోట్ల ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడ డిపోలో డ్రైవర్ వెంకన్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సమ్మెపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ చర్యకు దిగినట్లు సమాచారం. అయితే వెంటనే అప్రమత్తమైన తోటి ఉద్యోగులు ఆయనను అడ్డుకుని పెద్ద ప్రమాదం తప్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. స్థానిక ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన ఆర్టీసీ కార్మికుల్లో తీవ్ర కలకలం రేపింది. గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట డిపో ఎదుట సమ్మె శిబిరం వద్ద డ్రైవర్ బోలా శంకర్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటల్లోనే హాహాకారాలతోశంకర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. అక్కడే ఉన్న తోటి కార్మికులు వెంటనే మంటలను ఆర్పేశారు. పోలీసుల సహకారంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శంకర్ శరీరం 60 శాతం కాలిపోయినట్టు వైద్యులు చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితి ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్టు తెలిసింది. ఈ ఘటనతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. డిపో వద్ద ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది.

## ఆర్టీసీ కార్మికులు తీవ్ర చర్యలకు పాల్పడొద్దు

**నేడు మంత్రుల బృందంద చర్చలకు సిద్ధం**

**అనవసరంగా కుటుంబాలను రోడ్డుపాల్చేయవద్దు**

**కార్మికులకు మంత్రుల వినతి**

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు ఎవరూ తీవ్ర చర్యలకు పాల్పడవద్దని.. ఆవేశంలో ఉద్రేకానికి లోనయ్యి ఆత్మహత్యా ప్రయత్నాలు చేసుకోవద్దని మంత్రుల బృందం పిలుపునిచ్చింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కేబినెట్ భేటీలో చర్చించామని.. సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేబినేట్ భేటీ అనతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, దామోదరలు మీడియాతో మాట్లాడారు. నేడు ఆర్టీసీ కార్మికులతో డిప్యూటి సిఎం భట్టి బృదంచర్చలు జరుపుతుందన్నారు.

ఉద్రేకంలో.. భయంతో.. ఆవేశంలో కార్మికులు తీవ్ర చర్యలకు పాల్పడితే.. కుటుంబాలకు అన్యాయం చేసినోళ్లు అవుతారని.. ఎవరూ ఆత్మహత్యా ప్రయత్నాలకు దిగవద్దని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ సమ్మె చాలా చాలా పెద్దదని.. ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు..ఆర్టీసీ కార్మికులు ఎవరూ ఆత్మ బలిదానాల ఆలోచనలను విరమించుకోవాలని.. అలాంటి

ఆలోచనల వల్ల కుటుంబాలు వీధిన పడతాయని.. కార్మికుల న్యాయమైన డిమాండ్లు అన్నింటినీ అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం అని.. సమస్యలు అన్నింటినీ ప్రభుత్వం వింటుందని.. మీ కుటుంబాలను గుర్తు చేసుకుని సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికుడు త్వరగా కోలుకోవాలని.. అతనికి కావాల్సిన వైద్య సాయం అంతా ప్రభుత్వం దగ్గరుండి చూసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్
- కోఠిలోని డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ధర్నా

బలగం టీవీ, హైదరాబాద్

ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న శానిటేషన్, స్వీపర్స్, పేషంట్ కేర్, సెక్యూరిటీలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియోద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ అన్నారు. గురువారం హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, వైద్య విధాన పరిషత్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు తక్కువగా చెల్లిస్తున్నారని ఆరోపించారు. రూ.15,600 వేతనంలో భాగంగా కార్మికులకు చెల్లించాల్సిన మొత్తాన్ని తగ్గించి సుమారు రూ.11,000 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వేతనాలు చెల్లించేలా ఆస్పత్రుల అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వేతనాలు కూడా క్రమం తప్పకుండా ప్రతినెలా 1న చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలన్నారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్టర్ల వేధింపులను అరికట్టాలని, కార్మికులకు ఐడీ కార్డులు, యూనిఫార్ములు, షూస్, అవసరమైన పరికరాలు అందించాలన్నారు. అనంతరం డీహెచ్, డీఎంఈ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారస్వామితో పాటు వివిధ ఆస్పత్రుల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని రక్షించిన హైడ్రా

బలగం టీవీ, హైదరాబాద్

రూ.100 కోట్ల స్థలానికి కంచె వేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల రక్షణలో భాగంగా హైడ్రా అధికారులు కీలక చర్యలు చేపట్టారు. దుండిగల్ పరిధిలోని సర్వే నంబర్లు 120/1 పార్ట్‌లో 5 ఎకరాలు 10 గుంటలు, 120/28లో 3 ఎకరాలు 6 గుంటలు కలిపి మొత్తం సుమారు 8 ఎకరాలు 16 గుంటల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ భూమిలో అక్రమంగా నిర్మించిన ఫ్లాట్లు, కట్టడాలు, కబ్జాలను తొలగిస్తూ అధికారులు దూకుడుగా చర్యలు చేపట్టారు. అనంతరం మొత్తం భూభాగాన్ని చుట్టు ముట్టే విధంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని భద్ర పరిచారు. అధికారుల అంచనా ప్రకారం ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని తెలి పారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వానికి భారీ నష్టం తప్పిం దని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

అయితే, ఈ చర్యలపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ స్థలాలకు ప్రభుత్వమే పట్టాలు ఇచ్చిందని కొంతమంది బాధితులు పేర్కొంటూ తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా అధికారులు చర్యలు చేపట్టే సమయంలో కొంతమంది స్థానికులు ఆందోళనకు దిగుతూ నిరసనలు చేపట్టారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ అధికారులు వెనక్కి తగ్గకుండా కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అనంతరం బాధితులు దుండిగల్ తహసీల్దార్ కార్యాల యాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున చేరుకున్న స్థానికులు తమ సమస్యలను వినాలని, పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాంతో దుండిగల్, గండిమైసమ్మ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి



అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. మొత్తంగా హైడ్రా అధికారులు ప్రభుత్వ భూమిని రక్షించడంలో కఠినంగా వ్యవహరించి ప్రశంసలు అందుకో గా, మరోవైపు తమకు హక్కులు ఉన్నాయని చెబుతున్న స్థానికులు పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ ఘటన దుండి గల్ ప్రాంతంలో తీవ్ర చర్చకు దారి తీసింది. భవిష్యత్తులో ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలు ఉన్నట్టు కనిపిస్తోంది.

## కాళేశ్వరం కేసుపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

బలగం టీవీ, హైదరాబాద్



కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కె. చంద్రశేఖర్ రావు పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు తగవని, ఆయన నాయకత్వంలోనే నీళ్ల, నిధులు, నియామకాల లక్ష్యంతో తెలంగాణ ఉద్యమం విజయవంతమైందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ సాగునీటి పథకంగా కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజ్‌లో రెండు స్తంభాలు కుంగిపోవడాన్ని ఆధారంగా చేసుకుని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు లక్ష కోట్ల అవినీతి అంటూ దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో సమస్యలను సరిదిద్దేందుకు ముందుకొచ్చిన సంస్థలను బెదిరించారని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు రాష్ట్రంలో అధికంగా వరి ఉత్పత్తి జరిగిందని తెలిపారు. వచ్చిన ధాన్యం చూసి కేంద్రం కూడా ఆశ్చర్యపోయిందని, చివరికి వరి కొనలేమని ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని, అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని విమర్శించారు. అలాగే ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసే దిశగా ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి కేబినెట్‌లో నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**మాజీ కార్పొరేషన్ చైర్మన్ జి. దేవీప్రసాద్**

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రప్రభుత్వ దుర్మార్గ విధానాల ఫలితంగా అన్ని వర్గాల ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని మాజీ కార్పొరేషన్ చైర్మన్ జి. దేవీప్రసాద్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగితే, వాటిని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు సమర్పించిన 32 డిమాండ్లపై యాజమాన్యం చర్చలకు ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుతం సమ్మెను అణచివేయడానికి ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లను నియమించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాత్కాలిక డ్రైవర్ కారణంగా జరిగిన ప్రమాదంలో 38 మంది ప్రయాణికులు గాయపడినట్లు చెప్పారు.

తాండూరు ప్రాంతంలో పోలీసులు జారీ చేసిన హెచ్చరికలను ఖండిస్తూ, అవి అత్యవసర పరిస్థితులను గుర్తు చేస్తున్నాయని అన్నారు. ఆర్టీసీ సమ్మె వెనుక రాజకీయ నాయకులపై ఆరోపణలు చేయడం సరైంది కాదని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి గుణపాఠంగా మారాలని, ఇరిగేషన్ ఇంజినీర్లపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

# దక్షిణ కాశీ అభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట..



- శృంగేరి పీఠం సలహాల మేరకు రాజన్న ఆలయ పునర్నిర్మాణం.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల,:**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి మరియు విస్తరణ పనుల తీరుపై ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆయన క్షుణ్ణంగా చర్చించారు.

?ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి సంబంధించి ఈ దశలో చేపట్టాల్సిన కీలక పనులను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి అవసరాలకు అనుగుణంగా సవివరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని సూచించారు. దీనికి స్పందించిన అధికారులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు. అలాగే, ఆలయ పునర్నిర్మాణ అంశాలపై తుది నిర్ణయం కోసం మరోసారి శృంగేరి పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారిని సంప్రదించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో సమ్మక్క-సారక్క జాతర సమయంలోనే రాజన్న ఆలయ పనుల పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీశారని అన్నారు . ముఖ్యమంత్రి నేతృత్వంలో, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచనలకు అనుగుణంగా అతి త్వరలోనే ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, వీటీఏడీఏ వైస్ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌ఆ,లయ ఈవో రమాదేవి, ఆర్ అండ్ బీ అధికారులు, ఆర్కిటెక్టులు మరియు స్థపతి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



రానున్న సీజన్ లో రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కల్పించిన వసతులను పరిశీలించారు. ఎంత ధాన్యం వస్తుందని, గన్ని బ్యాగ్స్ పై నిర్వాహకులను ఆరా తీశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. హమాలీలు ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని అన్నారు.కొనుగోలు కేంద్రంలో అన్ని వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్ తో శుభ్రం చేయించాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని, ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని, నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు.కేటాయించిన మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఏపీఎం, ఏవో తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షికి జిల్లా కలెక్టర్ ఘన నివాళి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ముందుగా శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ సర్కార్ కుట్రలను హైకోర్టు తిప్పికొట్టింది.



- అభివృద్ధిని వదిలేసి కేసీఆర్‌పై ఏడుపు
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును, పీసీ ఘోష్ కమిషన్ విచారణ బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే పీసీ ఘోష్ నివేదికను అడ్డం పెట్టుకుని ప్రజల్లో అపోహలు సృష్టించిందని అన్నారు . తాజాగా ఈ నివేదికపై గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ కుట్రలను బట్టబయలు చేసిందని, ఇది రేవంత్ సర్కార్‌కు రాజకీయంగా గట్టి చెంపపెట్టు అని అన్నారు .?కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతూ, ఇది దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వప్నమని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రతో సుదీర్ఘ చర్చలు జరిపి, ఉభయ రాష్ట్రాలకు మేలు జరిగేలా ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాతే పనులు ప్రారంభించామని అన్నారు . గోదావరి జలాలను ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతోనే మేడిగడ్డ బ్యారేజీని నిర్మించామని, ఇందులో ఎలాంటి రహస్యాలు లేవని అన్నారు . కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కేవలం మేడిగడ్డ కాదని, అందులో వంద కాంపోనెంట్స్‌ఉన్నాయని, ప్రపంచస్థాయి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ఎల్ అండ్ టి మేడిగడ్డ బ్యారేజీని నిర్మించిందని అన్నారు.

?అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వారి అసమర్థతకు నిదర్శనమని అన్నారు . అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టాలనే ఏకైక ఎజెండాతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి కళ్లు మూస్తే కేసీఆర్ కనిపిస్తున్నారు, ఆ భయంతోనే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు. రైతాంగ సంక్షేమం గురించి ఆలోచించడం మాని, ప్రతిపక్ష నాయకులపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు .

?రాష్ట్రంలో హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కుల గొడుతున్నారని , పెద్దల ఆక్రమణలను ముట్టుకోకుండా, సామాన్య పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడం అత్యంత దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరి వీడాలని, తక్షణమే మేడిగడ్డ బ్యారేజీని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో కేటీఆర్ కృషితోనే సిరిసిల్ల జిల్లా అగ్రగామిగా నిలిచిందని, తెలంగాణ ప్రయోజనాలు మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోనే సురక్షితంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు.?ఈ సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు కొండూరు రవీందర్రావు, గూడూరి ప్రవీణ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## రుద్రంగిలో నేడు నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన:

### ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం శంఖుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ మహేష్ బి. గితే గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ నూతన భవన నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి గారు మరియు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు సంయుక్తంగా శంఖుస్థాపన చేసి ప్రారంభించనున్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ రమేష్ మరియు ఎస్సైలు మోతీరాం, రమేష్, యాదగిరి,పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.



## జోగినిపల్లి రవీందర్ రావు-శశికళ పెళ్లిరోజు వేడుకలు

**బలగం, బోయినిపల్లి;**

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు-శశికళ పెళ్లిరోజు సందర్భంగా కరీంనగర్ శ్రీపురం కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తదనంతరం వారి ఇంటి ఆవరణలో చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మరియు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జోగినిపల్లి రవీందర్ రావు-శశికళ మొక్క నాటారు.గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, మాజీ మండల అధ్యక్షుడు మెడుదుల మల్లేశం, కొండగట్టు మాజీ డైరెక్టర్ ముద్దం రవి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్, నాయకులు కిషన్, తిరుపతి, అనిల్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుండి వెళ్లిన వృద్ధురాలు చెరువులో శవమై...

**బలగం టీవీ,బోయినిపల్లి:**



గత మూడు రోజులుగా కనిపించకుండా పోయిన ఓ వృద్ధురాలు స్థానిక చెరువులో మృతదేహమై కనిపించింది. దీంతో బోయినిపల్లి మండలం కొరెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.పోలీసుల కథనం ప్రకారం.. కొరెం గ్రామానికి చెందిన రొమాల మల్లవ్వ (70) కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు.?కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో, ఆమె కుమారుడు రొమాల శరవాండు బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో కొరెం గ్రామ చెరువులో ఒక మృతదేహం తేలి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.?వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, అది గల్లంతైన రొమాల మల్లవ్వదేనని నిర్ధారించారు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఆమె మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

## పురిటి వాసన పోకముందే.. మురికి వాసనల మధ్య ముద్దులొలికే చిన్నారి..

- అమ్మ చాటున ఉండాల్సిన పసిపాప.. అనాథగా..
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

సృష్టిలో అమ్మ ప్రేమకు మించిన అమృతం లేదు అంటారు. కానీ, అదే అమ్మ కడుపున పుట్టిన ఓ పసికందు, పురిటి వాసన కూడా పోకముందే మురికి కూపంలో అనాథగా పడి ఉన్న ఘటన సిరిసిల్ల జిల్లాలో మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది.

అమ్మా అనే పిలుపు వినాల్సిన చెవులు, ఆ పసిపాప ఏడుపు విని తట్టుకోలేకపోయాయి. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో , ఒక మూలన ఉన్న మూత్రశాలలో ఆ పసిపాపను ఎవరో నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్లారు. మృదువైన ఉయ్యాలలో నిద్రించాల్సిన ఆ చిన్నారి, ఆ మురికి వాసనల మధ్య తల్లడిల్లిపోతూ వేసిన కేకలు అటుగా వెళ్తున్న ఓ మహిళ హృదయాన్ని ద్రవింపజేశాయి.

లోకం తెలియని ఆ ఆడబిడ్డ ఏడుపును విన్న ఆ మహిళ, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని ఆ పాపను అక్కున చేర్చుకున్నారు. వెంటనే ఆ చిన్నారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. . పసిపాప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు . ఆడపిల్ల పుట్టిందని భారంగా భావించారో, లేక సామాజిక భయాలతో ఆ తల్లిదండ్రులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారో తెలియదు.



## రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి..

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, మల్లారం, వేములవాడ పట్టణంలోని బాలా నగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు,ఆన్ లైన్ లో వెంటనే నమోదు చేశారా లేదా? అనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**ధాన్యం ఎప్పటికప్పుడు దింపుకోవాలి**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు. మర్రిపల్లిలోని మణికంఠ ఇండస్ట్రీస్, మారుతి ఇండస్ట్రీస్ లు, వేములవాడ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.



## ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్

**బలగం, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ డి.సి.ఎం.ఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యూసుఫ్ మొయినుద్దీన్,ఎంపీడీవో జయశీల,సొసైటీ ప్రత్యేక అధికారి గౌస్,వ్యవసాయ అధికారి ప్రణీత,సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వేసిరెడ్డి దుర్గారెడ్డి,నాయకులు కొప్పుల నగేష్,అక్కనపల్లి ఉపేందర్,ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లు, నాయకులు ఉన్నారు.




## సెమీఫైనల్ కు చేరిన బోయినిపల్లి జట్టు

**బలగం, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా బోయినిపల్లి జట్టు సెమి ఫైనల్ కు దూసుకెళ్లింది.గురువారం రోజున జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోయినిపల్లి ఎల్లారెడ్డిపేట జట్లు కలపడగా ఎల్లారెడ్డిపేట మొదట బ్యాటింగ్ చేసి 74 పరుగులు చేయగా బోయినిపల్లి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొంది, సెమీస్ కు దూసుకెళ్లింది.మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జంగం ప్రశాంత్ అందుకున్నారు. బోయినిపల్లి జట్టును బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కత్తెర పాక కొండయ్య,బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్యలు శుభాకాంక్షలు తెలిపారు.

# 26న వాసవీ మాత జయంతి

● అధికారికంగా నిర్వహించనున్న ప్రభుత్వం



హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం, అహింసా మూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి వేడుకలను ఇకపై ప్రతి ఏటా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ అధికారిక జీవో విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ప్రతి సంవత్సరం 'వైశాఖ శుక్ల పక్ష దశమి' రోజున వాసవి మాత జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఈ పర్వదినం ఏప్రిల్ 26వ తేదీన వస్తుండటంతో, ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. క్ష్మీష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను కోరింది. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల కోసం అయ్యే ఖర్చును సంబంధిత శాఖ బ్జడెట్ నుంచే కేటాయించనున్నారు. వ క్ష్మీసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సమాజ సేవలో, వ్యాపార రంగంలో ముందుండే ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని ఈ నిర్ణయం పెంపొందిస్తుందని వారు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు పేరుతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ నెల 26న తెలంగాణవ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, ఆర్యవైశ్య సత్రాలలో వేడుకలు ప్రభుత్వ లాంఛనాలతో అత్యంత వైభవంగా జరగనున్నాయి.




# కాళేశ్వరంపై న్యాయనిపుణులతో చర్చ

● తదుపరి కార్యాచరణపై సబ్‌కమిటీలో నిర్ణయం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం అంశంపై ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంత్రుల సబ్‌కమిటీ వేసుకుని.. చర్చించుకుని ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిస్తామని చెప్పారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐకి లేఖ రాసి 9 నెలలు గడిచినా ఎందుకు ముందుకెళ్లట్లేదో మీరే అర్థం చేసుకోవచ్చన్నారు. తాను, సీఎం రేవంత్ త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలవబోతున్నట్లు వెల్లడించారు.

'కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్ వేశారు. అయితే, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. కేసీఆర్, హరీశ్‌రావుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. కమిషన్‌ను చట్టవిరుద్ధం కాదని.. నివేదిక కొనసాగుతుందని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. సాంకేతిక అంశాల కారణంగానే కేసీఆర్, హరీశ్‌రావులపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారిద్దరూ నిర్దోషులని, కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కారని ఉన్నత న్యాయస్థానం ఎక్కడా చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.



# ఎదురుగట్ల గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..

**బలగం టీవీ, వేములవాడ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల కి రిబ్బన్ కట్ చేసి, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గృహప్రవేశం చేసుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి, వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామానికి చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇల్లంతకుంట అయ్యప్ప గుడికి విరాళం అందజేత

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రం లోని అయ్యప్ప గుడి అభివృద్ధి కొరకై 50118/- రూపాయలు విరాళంగా అందజేయడం జరిగింది. మండలంలోని రహీంఖాన్ పేట్ గ్రామానికి చెందిన కముటం శ్యామ్ సుందర్ అనే వ్యాపార వేత్త తమ తల్లిదండ్రులు కముటం శ్యామల మల్లయ్య గార్ల జ్ఞాపకార్థం ఆలయ అభివృద్ధి కై అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోజు గోపాల్ చారి, ఈదుల రవీందర్ రెడ్డి లతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బొల్లం పరశురామ్, మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ లు పాల్గొన్నారు

# ఏపీ హైకోర్టు తొలి మహిళా సీజేగా జస్టిస్ లిసా గిల్

**అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు**

**బలగం టీవి, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా నియమితులైన జస్టిస్ లిసా గిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ చరిత్రాత్మక మైలురాయి.. ఉన్నత న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగును సూచిస్తోందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధిత విభిన్న కేసులను సమర్థంగా నిర్వహిస్తూ.. విశిష్టమైన, ఆదర్శప్రాయమైన న్యాయవృత్తిని నిర్మించుకున్నారని తెలిపారు. న్యాయం పట్ల నిబద్ధతతో గౌరవాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. జస్టిస్ లిసా గిల్ పదవీకాలం విజయవంతంగా, స్ఫూర్తిదాయకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లిసా గిల్ నియమితులైన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నియామకానికి ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. సీజేగా జస్టిస్ లిసా గిల్ నియామకం ఈ నెల 25 నుంచి అమల్లోకి వస్తుందని అందులో పేర్కొంది. హైకోర్టు ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఈ నెల 24న పదవీ విరమణ చేయనున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు

● కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దు

● కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరిచర్యలు

● సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం

● మంత్రుల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపు

● వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు

● సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం

● తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

● వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు జరపనుంది. కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దని కేబినేట్ విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరిచ ర్యలు తీసుకోవాలని, న్యాయనిపుణులతో సంప్రదించాలని, సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపునకు ఉపయోగించాలని నిర్ణయించారు. వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయనున్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాల వివరాలు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరిలు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగింది. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసిన ఆయన.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు పిలుపు నిచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం కార్మిక సంఘాలతో భేటీ కానుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. ఇకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల వేతనాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలని కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సమస్య పరిష్కారానికి ఐదుగురు మంత్రులతో కార్మిక సంఘాలతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చర్చల ద్వారా పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే, రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కూడా కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికులు తొందరపడొద్దని, డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. కార్మికులు ప్రాణాలు తీసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సరైంది కాదని, ఆర్టీసీ

కార్మికుల పాత్ర రాష్ట్ర సాధనలో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని ఆయన కోరారు. అలాగే, కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపైనా కూడా చర్చ జరిగింది. ఈ కేసులో సిబిఐ విచారణకు ఒత్తిడి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇకపోతే గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదు. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది.

పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుందని తెలిపారు.

# రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు




● ఈకెవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా, రేషన్ కార్డు వినియోగదారులందరికీ 'ఈ-కేవైసీ' ప్రక్రియను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గతంలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, అనర్హులను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. చాలా మంది లబ్ధిదారులు తమ కార్డులలో వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల రేషన్ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే లక్షలాది కార్డులు నిబంధనలు పాటించని కారణంగా రద్దు చేశారు. కాబట్టి, ప్రభుత్వం అందించే ఉచిత లేదా రాయితీ బియ్యం, ఇతర సరుకులను నిరంతరాయంగా పొందాలంటే.. ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధ్రువీకరణ పూర్తి చేసుకోవడం అత్యవసరం.

రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తి బ్రతికే ఉన్నారా లేదా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల కార్డులు ఉన్నాయా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయోమెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం

నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ-కేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. మీరు ప్రస్తుతం మీ ఊరిలో లేకపోయినా, 'వన్ నేషన్ ? వన్ రేషన్ కార్డ్' పథకం ద్వారా మీరు ఉన్న చోటే దగ్గరలోని రేషన్ షాపులో కేవైసీ పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికీ చాలా మంది రేషన్ కార్డుదారులు తమ ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదని.. వారు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. దీంతో పాటు.. వరుసగా మూడు నెలల కంటే ఎక్కువ నెలలు ఆ రేషన్ కార్డు ద్వారా ఎలాంటి రేషన్ తీసుకోకపోతే.. ఆ కార్డులు కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా రద్దైన కార్డులు కూడా దేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి.

# రాహుల్ గాంధీతో పిసిసి చీఫ్ భేటీ

● రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ

● పార్టీ సంస్థాగత నిర్మాణంపైనా చర్చ

● నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన

**బలగం టీవి, న్యూఢిల్లీ**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్లేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. 'బీసీ గణన చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు, కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావాలి' అని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు



కల్పించాలనే డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తీపి కబురు అందిస్తూ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను మే నెలలోగా భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తయిందని,

త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. రాహుల్ గాంధీతో భేటీ అత్యంత సంతృప్తికరంగా సాగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి రాహుల్ కొన్ని సూచనలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే తమ తక్షణ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణి కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు ఇవ్వాలి: పింగిలి శ్రీపాల్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**



సింగరేణి పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు పన్నెండు నెలల వేతనాలు చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సింగరేణి సీఎండీ బుద్ధప్రకాశ్ జ్యోతి ను కోరారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సీఆర్టీలు సంవత్సరంలో కేవలం పది నెలల వేతనాలు మాత్రమే పొందుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయంపై బుద్ధప్రకాశ్ జ్యోతి సానుకూలంగా స్పందిస్తూ, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి చేర్చేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీపాల్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా కాంట్రాక్టు ఉపాధ్యాయులకు కనీస వేతనం చెల్లించే అంశంపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి ఆసుపత్రులతో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా వారికి ఉచిత వైద్యం అందించాలని కోరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ ఆడిట్ కమిటీ ఛైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై చేతిలో ముంబై ఓటమి



- 103 పరుగుల భారీ తేడాతో సీఎస్‌కే ఘనవిజయం
- సంజూ శాంసన్ సెన్సేషనల్ సెంచరీ (101 నాటౌట్)లిలి
- అకీల్ హోసెన్ స్పిన్ మ్యాజిక్.. ముంబై బ్యాటర్లు విలవిల

**బలగం టీవి, ముంబై**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. గురువారం తమ సొంత మైదానమైన వాంఖడే స్టేడియంలో జరిగిన హై-వోల్టేజ్ పోరులో ముంబై దారుణంగా విఫలమైంది. చిరకాల ప్రత్యర్థి చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) 103 పరుగుల భారీ తేడాతో ముంబైని మట్టికరిపించింది. సంజూ శాంసన్ అజేయ శతకానికి తోడు, అకీల్ హోసెన్ మెరుపు బౌలింగ్ తోడవడంతో చెన్నై అద్భుత విజయాన్ని అందుకుంది.

**శాంసన్ వీరవిహారం..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా, సంజూ శాంసన్ (54 బంతుల్లో 101 నాటౌట్; 10 ఫోర్లు, 6 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ముంబై బౌలర్లలో ఘజన్‌ఫర్, అశ్వని కుమార్ రెండేసి వికెట్లు తీసినా, పరుగులను మాత్రం నియంత్రించలేకపోయారు.

**పేకమేడలా కూలిన ముంబై బ్యాటింగ్..**

208 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైకి ఆదిలోనే షాక్ తగిలింది. స్పిన్నర్ అకీల్ హోసెన్ తన తొలి ఓవర్‌లోనే వికెట్ల వేట మొదలుపెట్టాడు. సూర్యకుమార్ యాదవ్ (35), తిలక్ వర్మ (37) కొద్దిసేపు ప్రతిఘటించినా, మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ముఖ్యంగా నమన్ ధీర్, మలెవర్, రూథర్‌ఫోర్డ్ వంటి హిట్టర్లు డకౌట్ కావడం అభిమానులను నిరాశకు గురిచేసింది. దీంతో ముంబై 19 ఓవర్లలో కేవలం 104 పరుగులకే కుప్పకూలింది.

**అకీల్ హోసెన్ 'పంచ్'..**

చెన్నై బౌలర్లలో అకీల్ హోసెన్ 4/17 గణాంకాలతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సీఎస్‌కే టోర్నీలో మూడో విజయాన్ని నమోదు చేయగా, ఐదో ఓటమితో ముంబై పాయింట్ల పట్టికలో దిగువకు పడిపోయింది.



# మూడో టీ20లోనూ భారత మహిళల జట్టు ఓటమి



**బలగం టీవి, న్యూఢిల్లీ**

సౌతాఫ్రికా పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా మూడో టీ20లోనూ ఓటమిపాలైంది. జొహెన్నస్?బర్గ్ వేదికగా ఆతిథ్య సౌతాఫ్రికాతో తాజాగా జరిగిన మూడో మ్యాచ్?లో భారత్ 9 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 193 పరుగుల భారీ టార్గెట్?ను సఫారీ జట్టు కేవలం 1 వికెటే కోల్పోయి 16.3 ఓవర్లలోనే ఛేదించడం విశేషం. కెప్టెన్ లారా వోల్వార్ట్ (115 పరుగులు, 53 బంతుల్లో) సూపర్ సెంచరీతో అదరగొట్టగా, సున్ లస్ (64లి పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించింది. దీంతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. భారత్ బౌలర్లలో శ్రేయాంక పాటిల్ మాత్రమే వికెట్ తీయగలిగింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64 పరుగులు), కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ (66 పరుగులు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. స్మృతి మంధాన (37 పరుగులు) ఫర్వాలేదనిపించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 2, నడైన్ డి క్లర్క్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, తాజా విజయంతో ఐదు మ్యాచ్?ల టీ20 సిరీస్?ను సౌతాఫ్రికా 3-0తో దక్కించుకుంది. తొలి రెండు మ్యాచ్?ల్లోనూ టీమ్‌ఇండియా ఓడింది. ఇరుజట్ల మధ్య నామమాత్రపు నాలుగో టీ20 మ్యాచ్ ఏప్రిల్ 25న జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ పర్యటనలో భారత్ గత రెండు మ్యాచ్?ల్లో కంటే ఈసారి బ్యాటింగ్?లో మెరుగ్గా రాణించింది. సిరీస్? దక్కించుకోవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్?కు దిగింది. ఓపెనర్లు మంధాన- షఫాలీ మంచి ఆరంభం ఇచ్చారు. వన్?డౌన్?లో జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమైనా, కెప్టెన్ హర్మన్ చెలరేగింది. ఓపెనర్లు ఇచ్చిన శు భారంభాన్ని కొనసాగిస్తూ జోరును ప్రదర్శించింది. 173.68 స్ట్రైక్ రేట్?తో 66 రన్స్ చేసింది. చివర్లో రిచా ఘోష్ (18లి) కూడా బాగా ఆడింది. దీంతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఇంతటి స్కోర్ చేయడంతో టీమ్‌ఇండియా గెలుస్తుందని అనుకున్నారంతా. కానీ సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభం అయ్యాక అంచనాలు తారుమారయ్యాయి. ఓపెనర్లు వోల్వార్ట్, లుస్ రెచ్చిపోయారు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఈ క్రమంలోనే వోల్వార్ట్ సెంచరీ, లుస్ హాఫ్ సెంచరీలు సాధించారు. వీళ్ల విధ్వంసం సృష్టించడంతో చాలా ముందే భారత్ ఓటమి ఖరారైంది. 15.3 ఓవర్ వద్ద ఎట్టకేలకు భారత్ తొలి వికెట్ తీసింది. సెంచరీ సాధించిన వోల్వార్ట్?ను శ్రేయంక ఔట్ చేసింది. అప్పటికి సౌతాఫ్రికా స్కోర్ 183. ఈ ఏడాది జూన్?లో ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 వరల్డ్?కప్ జరగనుంది. గతేడాది వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో భారత్? ఈ టోర్నీలో అడుగుపెట్టనుంది. టైటిల్ ఫేవరెట్?గా దిగనున్న టీమ్‌ఇండియాకు ఆ టోర్నీ ముందు ఇలాంటి సిరీస్? ఆందోళన కలిగిస్తుంది. ఈ పర్యటనలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, మూడింట్లోనూ భారత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు 193 పరుగుల భారీ లక్ష్యాన్ని సైతం కాపాడుకోలేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేదు. దీంతో వరల్డ్?కప్ ముంగిట ఇలా అయితే ఎలా? అంటూ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు!

# ఈ అవార్డు గుజరాత్ మంత్రికి అంకితమిస్తున్నా : రవీంద్ర జడేజా

**బలగం టీవి, న్యూఢిల్లీ**

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్?లో రాజస్థాన్ రాయల్స్ భళా అనిపించింది. బ్యాటుతో తడబడ్డా బంతితో రాణించిన రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా ఆల్?రౌండ్ ప్రదర్శనతో రాణించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డును అతడు 'గుజరాత్ విద్యాశాఖ మంత్రి'కి అంకింతం ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం అవార్డ్? ప్రజెంటేషన్?లో జడేజా కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయంలో కీలకంగా మారినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు. 'మ్యాచ్ గెలిపించినందుకు హ్యాపీగా ఉంది. అయితే అవార్డును నేను గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి డెడికేట్ చేస్తున్నా. ఎందుకంటే నేను ఇవాళ అద్భుతమైన ప్రదర్శన చేస్తానని ఆమె నిన్ననే నాతో చెప్పింది. ఆమెకు థాంక్స్?' అని జడ్డూ పేర్కొన్నాడు. కాగా, ఆ మంత్రి ఎవరో కాదు జడేజా సతీమణి రివాబా జడేజానే!సుదీర్ఘ ఐపీఎల్? కెరీర్?లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం జడేజాకు ఇది 17వసారి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ తరపున కాకుండా ఇతర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డు దక్కించుకోవడం మాత్రం ఇదే తొలిసారి. సీఎస్కేకు కాకుండా జడేజా ఇతర ఆయా జట్ల (రాజస్థాన్, కొచ్చి టస్కర్స్ కేరళ, గుజరాత్ లయన్స్)కు 75 మ్యాచ్?ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇక చెన్నై తరపున 186 మ్యాచ్?ల్లో బరిలోకి దిగగా అందులో 16 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. లఖ్?నవూతో మ్యాచ్?లో పిచ్ బ్యాటింగ్?కు? అంతగా సహకరించలేదు. టాపార్డర్ విఫలమైన వేళ జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలబడి స్కోర్ బోర్డును నడిపించాడు. 29 బంతులు ఆడిన జడ్డూ 43 పరుగులు చేసి నాటౌట్?గా నిలిచాడు. ఇందులో 2 ఫోర్లు, 1 సిక్స్? ఉన్నాయి. అనంతరం బౌలింగ్?లోనూ రాణించాడు. నాలుగు ఓవర్లో కోటాలో 29 పరుగులిచ్చి 1 వికెట్ దక్కించుకున్నాడు. అదీనూ నికోలస్ పూరన్ వికెట్ కావడం విశేషం. ఇక మ్యాచ్ విషయానికొస్తే, రాజస్థాన్ నిర్దేశించిన 160 లక్ష్య ఛేదనలో లఖ్?నవూ తేలిపోయింది. మిచెల్ మార్ష్ (57) మినహా మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. 18 ఓవర్లలో లఖ్?నవూ 119 పరుగులకు కుప్పకూలిపోయింది. దీంతో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది.



రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, నాండ్రె బర్గర్, బ్రిజేష్ శర్మ చెరో 2, రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జడేజా భార్య రివాబా జడేజా నార్త్ జామ్?నగర్? స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. అయితే గతేడాది గుజరాత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెను మంత్రి పదవి వరించింది. ప్రస్తుతం ఆమె ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేబినెట్?లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.లఖ్?నవూ స్పీడ్ గన్ మయంక్ యాదవ్ ఈ మ్యాచ్?తో ఐపీఎల్?లో ఎంట్రీ ఇచ్చాడు. అయితే అతడికి ఆశించిన రేంజ్?లో కమ్?బ్యాక్ రాలేదు. 140ం వేగంతో బంతులేసినా ధారాళంగా పరుగులు ఇచ్చాడు. నాలుగు ఓవర్లో

# సారీ సార్ మీ నమ్మకం నిలబెట్టలేకపోయాను..

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సొంత గడ్డపై రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసింది. కేవలం 160 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో, చేతులెత్తేసి 119 పరుగులకే కుప్పకూలింది. అయితే, మ్యాచ్ ఫలితం కంటే కూడా మైదానం బయట లక్నో యజమాని సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్ మధ్య జరిగిన ఒక ఆసక్తికర సన్నివేశం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. రాజస్థాన్ రాయల్స్ మొదట బ్యాటింగ్ చేసి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్నో పిచ్‌పై ఇది చాలా తక్కువ స్కోరు అని అందరూ భావించారు. కానీ లక్నో బ్యాటర్లు ఒక్కొక్కరుగా పెవిలియన్ కు క్యూ కట్టారు. ముఖ్యంగా కెప్టెన్ రిషబ్ పంత్ ఆటతీరుపై విమర్శలు వస్తున్నాయి. మొదటి ఓవర్‌లోనే బదోని రన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంత్, బాధ్యతాయుతంగా ఆడాల్సింది పోయి ఎదురుదాడికి దిగాడు. కేవలం మూడు బంతులు ఆడిన పంత్, భారీ షాట్ కు ప్రయత్నించి డకౌట్ అయ్యాడు. దీంతో టీమ్ మొత్తం ఒత్తిడిలోకి వెళ్లి 119 పరుగులకే ఆలౌట్ అయింది. సాధారణంగా సంజీవ్ గోయెంకా అంటే క్రికెట్ పట్ల చాలా ఎమోషనల్ గా ఉంటారు. గతంలో కేఎల్ రాహుల్ కెప్టెన్ గా ఉన్నప్పుడు ఓటమి తర్వాత మైదానంలోనే ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అయితే బుధవారం సీన్ మొత్తం రివర్స్ అయ్యింది. మ్యాచ్ ముగిసిన తర్వాత పంత్ మరియు సంజీవ్ గోయెంకా ఎదురుపడ్డారు. పంత్‌ను గోయెంకా నవ్వుతూ హత్తుకున్నారు. ఓటమి భారంతో ఉన్న కెప్టెన్ కు ఆయన భరోసా ఇస్తున్నట్లుగా ఆ ఫోటోలో కనిపించింది. ఇది చూసిన నెటిజన్లు గోయెంకాలో ఇంత మార్పు వచ్చిందా అని ఆశ్చర్యపోతున్నారు. మ్యాచ్ అనంతరం ఓటమికి గల కారణాల గురించి ప్రశ్నించగా, రిషబ్ పంత్ దగ్గర సమాధానం లేకపోయింది. మేము ఎక్కడ తడబడ్డామో చెప్పడానికి నా దగ్గర మాటలు లేవు అని పంత్ అన్నాడు. ముఖ్యంగా బ్యాటింగ్ వైఫల్యం వల్లే ఈ మ్యాచ్ ఓడిపోయామని ఆయన అంగీకరించారు. బాధ్యతారాహిత్యంగా షాట్లు ఆడి వికెట్లు పారేసుకోవడం జట్టు విజయవకాశాలను దెబ్బతీసిందని, వచ్చే మ్యాచుల్లో ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని పంత్ చెప్పుకొచ్చారు.సంజీవ్ గోయెంకాను విమర్శించే వారంతా ఈ వైరల్ ఫోటో చూసి సైలెంట్ అయిపోయారు. గెలిచినా ఓడినా ఆటగాళ్లకు అండగా ఉండటమే నిజమైన టీమ్ ఓనర్ లక్షణమని క్రికెట్ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అదే సమయంలో రిషబ్ పంత్ తన ఫామ్ పై దృష్టి పెట్టాలని, కెప్టెన్ గా ఇలాంటి కీలక మ్యాచుల్లో డకౌట్ అవ్వడం టీమ్ మోరల్ ను దెబ్బతీస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# 2028 ఒలింపిక్స్‌లో అధికారికంగా క్రికెట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రపంచంలో రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్ వేదికపై కనిపించి దశాబ్దాలు దాటిపోయింది. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. సరిగా 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడల్లో మళ్లీ మెరవబోతోంది. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ 2028 నిర్వాహకులు క్రికెట్ పోటీల కోసం దక్షిణ కాలిఫోర్నియాలోని పామోనాలో ఉన్న ఫెయిర్ గ్రౌండ్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. ఈ చారిత్రక మైదానంలో బుధవారం నాడు స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ స్టేడియం సుమారు పదివేల కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించబోతున్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన ఈ ప్రీమియర్ క్రికెట్ స్టేడియం పురుషుల, మహిళల పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నిర్మాణ పనుల ప్రారంభాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైలురాయిగా అభివర్ణించింది. ఒలింపిక్ చరిత్రలో తొలిసారిగా ఒక క్రీడ మ్యాచ్ సమయాలను భారతీయ ప్రామాణిక సమయానికి అనుగుణంగా రూపొందించడం విశేషం. భారత ఉపఖండంలోని వంద కోట్లకు పైగా ఉన్న క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతాయి. ఇది భారత కాలమాన ప్రకారం వరుసగా రాత్రి 9.30 గంటలకు, ఉదయం 7 గంటలకు అవుతుంది. ఈ సమయాలు భారత టీవీ ప్రేక్షకులకు, డిజిటల్ వీక్షకులకు అత్యంత అనుకూలమైనవి. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతక పోరు ముగిసిన తర్వాతే స్వర్ణ పతక పోరు జరుగుతుంది. కానీ క్రికెట్ విషయంలో ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, స్వర్ణ పతక మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించాలని నిర్ణయించారు. ఇది భారత్ ప్రైమ్‌కు సరిగా సరిపోతుంది. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని నమ్మకంతోనే వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి నిర్వాహకులు ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. లాూ28 ఒలింపిక్స్‌లో క్రికెట్ అత్యంత వేగవంతమైన టీ 20 ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పురుషుల, మహిళల విభాగాల్లో చెరో ఆరు జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటాయి క్రికెట్ ఒలింపిక్స్‌లో చేర్చడం ద్వారా కొత్త దేశాలకు ఈ క్రీడను విస్తరించవచ్చని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో టీ20 ఫార్మాట్ విజయవంతమైంది. ఐసీసీ ఛైర్మన్ జైషా ఈ పరిణామాలపై సంతోషం వ్యక్తం చేశారు. వేదికల ప్రకటన అనేది ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి పడిన తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఐఓసీతో కలిసి క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ ఉద్యమంలో భాగం కావడం వల్ల క్రికెట్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి మరింత నిధులు , మద్దతు లభిస్తుందని ఐసీసీ పేర్కొంది. అమెరికా క్రీడా అభిమానులు హోమ్ రన్‌లు, లాంగ్ బాల్స్‌ను ఇష్టపడతారని, క్రికెట్‌లో ఇవి పుష్కలంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ ద్వారా అమెరికన్లకు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. లాూ28లో క్రికెట్‌తోపాటు బేస్ బాల్/ సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ వంటి క్రీడలు కూడా కొత్తగా చేరాయి. భారత్ , ఉపఖండం కోసం మీడియా హక్కుల విక్రయం విషయంలో నిర్వాహకులు మూడు రకాల ప్యాకేజీలు సిద్ధం చేశారు. మల్టీప్లాట్‌ఫామ్, టీవీ ఓన్లీ, డిజిటల్ ఓన్లీ. దీని ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# మ్యాక్స్‌వెల్ రికార్డ్ బ్రేక్ చేసిన వైభవ్

**బలగం టీవి, న్యూఢిల్లీ**



రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్?లో రికార్డుల మీద రికార్డులను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. తాజాగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో మ్యాచ్?లో 8 పరుగులకే పెవిలియన్ చేరినప్పటికీ వైభవ్ తన పేరిట పలు రికార్డులు లిఖించుకున్నాడు. అతడితోపాటు జట్టు స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఓ అరుదైన ఘనత అందుకున్నాడు.టాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన రాజస్థాన్?కు ఘనమైన ఆరంభం దక్కలేదు. జైస్వాల్ వేగంగా ఆడినా, లీగ్?లో తొలిసారి వైభవ్ ఇబ్బంది పడ్డాడు. 11 బంతులు ఎదుర్కొని కేవలం 8 పరుగులే చేశాడు. అతడిని మెహ్సిన్ ఖాన్ పెవిలియన్?కు చేర్చాడు. అయితే 2 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్దే వైభవ్ సూపర్ రికార్డు సాధించాడు. గతేడాది ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన ఈ చిచ్చరపిడుగు 500 పరుగుల మైలురాయి అందుకున్నాడు. అతడు కేవలం 237 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో ఈ మైల్?స్టోన్ సాధించిన బ్యాటర్?గా అరుదైన ఘతన సాధించాడు. ఈ క్రమంలోనే స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్?వెల్ రికార్డ్?ను వైభవ్ బద్దలుకొట్టాడు. 500 పరుగులు పూర్తి చేసేందుకు మ్యాక్స్?వెల్ 260 బంతులు తీసుకున్నాడు. ఈ మ్యాచ్ ఆడిన నాటికి వైభవ్ వయసు 15ఏళ్ల 26 రోజులు. ఈ నేపథ్యంలో ఐపీఎల్?లో 500 రన్స్? పూర్తి చేసుకున్న అత్యంత పిన్న వయస్కుడిగానూ వైభవ్ రికార్డు కొట్టాడు. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఈ మ్యాచ్?లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఎయిడెన్ మార్?క్రమ్? సహా, మయంక్ యాదవ్, మోహ్సిన్ ఖాన్?ను పెవిలియన్?కు చేర్చాడు. మొత్తం నాలుగు ఓవర్ల కోటాలో ఒక మెయిడెన్ సహా 20 రన్స్ ఇచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే రాజస్థాన్? రాయల్స్ తరపున ఐపీఎల్?లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్?గా నిలిచాడు. ఇదివరకు యుజ్వేంద్ర చాహల్ (66 వికెట్లు) పేరిట ఈ రికార్డు ఉంది. తాజాగా ఆర్చర్ ఆ రికార్డ్?ను అధిగమించాడు.

# నంద్రే బర్గర్‌పై మ్యాచ్ రిఫరీ చర్యలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ నిబంధనలను ఉల్లంఘించిన రాజస్థాన్ రాయల్స్ పేసర్ నంద్రే బర్గర్‌పై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బర్గర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించారు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నంద్రే బర్గర్(2/27) మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్‌ను డకౌట్ చేయడంతో పాటు హాఫ్ సెంచరీతో క్రీజులో పాతుకుపోయిన మిచెల్ మార్ష్(55)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌వైపు మలుపు తిప్పాడు. ఈ వికెట్లను బర్గర్ అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాళ్లను దూషిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై అంపైర్ల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన మ్యాచ్ రిఫరీ బర్గర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించాడు.ఈ మేరకు ఐపీఎల్ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రాజస్థాన్ రాయల్స్ బౌలర్ నంద్రే బర్గర్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించాం. ఒక డీమెరిట్ పాయింట్‌ను అతని ఖాతాలో చేర్చాం. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలింది. ఆర్టికల్ 2.5 ప్రకారం మరో ఆటగాడిని కించపరిచేలా ప్రవర్తించడం, అనుచిత ప్రవర్తన , భాష ఉపయోగించినట్లు తేలితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బర్గర్ లెవల్ 1 ఉల్లంఘనకు పాల్పడినట్లు మ్యాచ్ రిఫరీ తీసుకున్న తుది నిర్ణయంతో ఈ జరిమానా విధించడం జరిగింది.'అని ఐపీఎల్ తమ ప్రకటనలో పేర్కొంది.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 40 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులే చేసింది. రవీంద్ర జడేజా(29 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 43 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో మహమ్మద్ షమీ(2/30), ప్రిన్స్ యాదవ్(2/29), మోహ్సిన్ ఖాన్(2/17) రెండేసి వికెట్లు తీసారు. అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ 18 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్(41 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌తో 55) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. మిచెల్ మార్ష్‌తో పాటు నికోలస్ పూరన్(22), హిమ్మత్ సింగ్(15) మినహా అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆయుష్ బదోని(0), రిషభ్ పంత్(0), ఎయిడెన్ మార్క్‌రమ్(0) డకౌట్‌గా పెవిలియన్ చేరారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(3/20) మూడు వికెట్లు తీయగా.. నంద్రే బర్గర్(2/27), బ్రిజేష్ శర్మ(2/18) రెండేసి వికెట్లు పడగొట్టారు. రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్‌లకు తలో వికెట్ దక్కింది.

# ధోనీ వల్లే స్టేడియాలు పసుపు మయం

- చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ వల్లే తాము ఎక్కడికి వెళ్లినా స్టేడియాలు పసుపు మయం అవుతున్నాయని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. దురదృష్టవశాత్తు ఆయన ఆడటం లేదని, కానీ ఈ క్రేజ్ సృష్టికర్త ధోనీనే అని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో వాంఖడే వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రుతురాజ్ గైక్వాడ్‌ను ముంబైలో సీఎస్‌కే క్రేజ్ గురించి హోస్ట్ ప్రశ్నించాడు. ధోనీ వల్లే ఈ క్రేజ్ అని గైక్వాడ్ బదులిచ్చాడు. టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకోవాలనుకున్నామని గైక్వాడ్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ ఇది 50-50 నిర్ణయమే. పిచ్ బాగుంది. వాంఖడేలో ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా మెరుగైన ప్రదర్శన కనబర్చడం ముఖ్యం. కాబట్టి మొదట బ్యాటింగ్ చేసినా సరే అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడం కీలకం. మేం మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాం. కానీ కీలక సమయాల్లో అవకాశాలను చేజార్చుకుంటున్నాం.గత మ్యాచ్‌లో మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్‌లో కూడా మంచి ఆరంభం లభించింది. కానీ కీలక సమయంలో తడబడి విజయాన్ని చేజార్చుకున్నాం. జట్టులో అందరూ ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మా దిగ్గజం ధోనీ వల్లే మేం ఎక్కడికి వెళ్లినా అభిమానుల మద్దతు లభిస్తోంది. స్టేడియాలు పసుపుమయం అవుతున్నాయి. దురదృష్టవశాత్తూ ధోనీ ఈ మ్యాచ్ ఆడటం లేదు. కానీ ఇదంతా ఆయన సృష్టించిన ప్రభావమే. ఈ రాత్రి మా అభిమానులను సంతోషపరుస్తామని ఆశిస్తున్నాను. మా జట్టులో రెండు మార్పులు ఉన్నాయి.'అని రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. మరోవైపు టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. గత మ్యాచ్ తరహాలోనే మెరుగైన ప్రదర్శన చేసి విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు.